

నేటినుంచే గైట్ ప్రాంగణంలో
తెలుగు మహాసభలు 7లో

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు 7లో

నష్టం అంచనాలు.. ఇలాగేనా?



పిఠాపురంలో ఇటీవల మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంట

- పంటనష్టం అపారం.. నమోదు అంతంతమాత్రం
- ప్రభుత్వానికి చేరిన నష్టం తుది నివేదికలు
- మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు ఊరట గగనమే

పిఠాపురం, జనవరి 4: మిచౌంగ్ తుఫాన్ పంటలను తుడిచిపెట్టేసింది. రైతులకు కన్నీరే మిగిలింది. నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం నష్టం అంచనాల నమోదులో నిబంధనలు సాకుగా చూపి కోత విధించింది. జరిగిన నష్టంలో సగం కూడా నమోదు కాకపోవడంతో రైతులకు ఊరట లభించడం గగనమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులతో కురిసిన అతి భారీవర్షాలు జిల్లా రైతాంగం వెన్నువిరిచాయి. సార్వా వరిసాగు చేసిన పొలాల్లో ఉండిపోయిన వరిపనలు, కుప్పలు నీటిలో నానగా పలుచోట్ల ధాన్యం రాశులు తడిచిపోవడంతోపాటు కొట్టుకుపోయాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నేలనంటింది. పలుచోట్ల రోజుల తరబడి వరి నీటిలో నానడంతో ధాన్యం మొలకలు వచ్చింది. కాకినాడ జిల్లాలో 70వేల ఎకరాలకు పైగా వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. వరితోపాటు అపరాలు, పత్తి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న, అరటి, బొప్పాయి, మునగ, కాయగూరలు తదితర ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టాలు ప్రాథమికంగా అంచనా వేసిన దాని కంటే అధికంగా ఉంటుందని భావించినా అధికారులు తేల్చిన లెక్కలు అందరికీ షాక్‌ను ఇచ్చాయి. తుఫాన్‌కు దెబ్బతిన్న, రంగు మారిన ధాన్యం రాశులు ఇంకా కాకినాడ జిల్లాలో పలుచోట్ల పొలాల్లోనే ఉండిపోవడం నష్టం తీవ్రతను తెలుపుతున్నా ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో అది ప్రతిబింబించకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నష్టం అంచనాలే ఆలస్యంగా..

గతనెల 4న తుఫాన్ వచ్చి పంటలకు అపారనష్టం కలిగించింది. సాధారణంగా నష్టం జరిగిన మూడురోజుల తర్వాత పంటనష్టం అంచనాలకు గ్రామాల వారీగా బృందాలను నియమించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నమోదు చేస్తారు. ఇప్పుడు మాత్రం నెల తర్వాత నష్టం అంచనాల నమోదును ప్రారంభించారు. దీనిపైనే అప్పట్లో విమర్శలు వచ్చాయి. అప్పటికే వర్షాలకు తడిచిన ధాన్యం రాశులు, దెబ్బతిన్న వరిపంటను రైతులు ఒబ్బిడి చేసుకున్నారు. నేలనంటిన వరిపంటను కోసి కొన్నిచోట్ల మాసూళ్లు పూర్తి చేశారు. ఇటువంటి వాటిని నమోదు చేసేందుకు పలుచోట్ల బృందాలు అంగీకరించకపోవడం, వరికుప్పలు, ధాన్యం రాశులు వారంరోజులకు పైగా నీటిలో నానినా నిబంధనల పేరుతో వాటిని నమోదు చేయకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. పలుప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను తొలగించిన తర్వాత ఈ బృందాలు అక్కడకు వెళ్లడంవల్ల నష్టం నమోదు సక్రమంగా జరగలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

50శాతం లోపుగానే..

పంటనష్టాల నమోదు ఆలస్యంగా ప్రారంభం కావడం, నిబంధనల పేరిట పలుచోట్ల నష్టాలను నమోదు చేయకపోవడంతో దాని ప్రభావం తుది నివేదికలపై పడింది. 70వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేయగా అధికారులు, సిబ్బందితో కూడిన బృందాలు పరిశీలన, నష్టాల నమోదు, ఆర్బీకేల్లో జాబితాల ప్రదర్శన తర్వాత కాకినాడ జిల్లాలో 31045 ఎకరాల్లో వరిపంటకు మాత్రమే నష్టం జరిగిందని నిర్ధారించారు. 26,905మంది రైతులకు రూ.2137కోట్లు పరిహారంగా చెల్లించాలని ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పించారు. 1079 ఎకరాల్లో అపరాలు, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు, 3,950 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు నష్టం జరిగిందని నివేదించారు.

సీఎం ప్రకటన ఆర్భాటమేనా..

పంట నష్టాల నమోదులో ఉదారంగా వ్యవహరిస్తామని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తామని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. నిబంధనల విషయంలో సడలింపులు ఉంటాయని అధికార పార్టీ ప్రతినిధులు అప్పట్లో చెప్పారు. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జరిగిన నష్టంలో కనీసం 50శాతం కూడా నివేదికల్లో నమోదు కాకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎక్కడికక్కడ నిబంధనల పేరుతో వరి సహా ఇతర పంటలకు జరిగిన నష్టాలను పూర్తిస్థాయిలో నమోదు చేయలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో తుఫాన్ల సమయాల్లో వేసిన ప్రాథమిక అంచనాల కంటే తుది అంచనాల నమోదు అధికంగా ఉండడం జరిగేదని, ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పంట నష్టం నివేదికలు చూస్తుంటే మిచౌంగ్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఊరట దక్కడం గగనంగానే కనిపిస్తోంది.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో..
7న కాకినాడలో ముత్యాల ముగ్గుల పోటీలు

కాకినాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణంలోని పీఆర్ కాలేజీ ఎదురుగా ఉన్న మెక్లరిన్ హైస్కూల్‌లో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈనెల 7న ఆదివారం జరగనున్నాయి. జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా కాకినాడకు చెందిన సానాసతీష్ ఫౌండేషన్ వ్యవహరిస్తోంది. ఆ రోజు ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా నలుమూలలనుంచి మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్ల నమోదుకు 99494 85803, 9985411207, 9985411260 నెంబర్లను సంప్రదించగలరు.

ఎవరికి వారే.. వేరే దారే

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

- ప్రత్తిపాడు వైసీపీలో రాజుకుంటున్న రగడ
- సిట్టింగ్ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ వర్సస్ కొత్త ఇన్‌ఛార్జి వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీలో రానురాను వేరు కుంపట్లు రాజుకుంటున్నాయి. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు అధిష్ఠానం టిక్కెట్ నిరాకరించి ఆయన స్థానంలో కొత్త ఇన్‌ఛార్జిగా వరుపుల సుబ్బారావును నియమించింది. దీంతో ఇప్పుడు ఈ రెండు వర్గాలు నువ్వా- నేనా అన్నట్లు నియోజకవర్గంలో తలపడుతున్నాయి. రెండేళ్లుగా వీరిద్దరూ వైసీపీలో తలోదారి అన్నట్లు ఉన్నారు. ఇప్పుడు అధిష్ఠానం టిక్కెట్ ప్రకటనతో ఇరువర్గాల మధ్య రుసరుసలు, బుసబుసలు ముదిరి పాకాన పడ్డాయి.

చెరో దారితో క్యాడర్‌లో గందరగోళం..

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎమ్మెల్యే పర్వత, కొత్త ఇన్‌ఛార్జి వరుపుల వేర్వేరుగా తమ అనుచరులతో పావులు కదుపుతుండడం వైసీపీకి తలనొప్పిగా మారింది. వచ్చేఎన్నికల్లో ఇక్కడినుంచి పోటీ చేయనున్న వరుపుల సుబ్బారావుకు ఎమ్మెల్యే పర్వత సహకరించరని తేలిపోవడంతో నియోజకవర్గంలో కాక రేగుతోంది. ఎమ్మెల్యే పర్వత తన అనుచరులతో గురువారం రహస్య సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగా టిక్కెట్ తెచ్చుకున్న వరుపులకు ఎవరూ సహకరించొద్దని పర్వత హుకుం జారీ చేయడం కలకలం రేపుతోంది. తనను జిల్లాలో ఓ కీలక ఎమ్మెల్యే దెబ్బకొట్టారని, టిక్కెట్ రాకుండా చేసి కక్ష తీర్చుకున్నారని పర్వత తన అనుచరులవద్ద వాపోయారు. ఈనేపథ్యంలో పార్టీకి ఎట్టిపరిస్థితుల్లో సహకరించొద్దనే చర్చ జరిగిందని సమాచారం. తనకు కాకుండా టిక్కెట్ వరుపులకు ఇవ్వడంతో సుబ్బారావు ఎలా గెలుస్తారో చూద్దామనే తరహాలో అనుచరుల వద్ద పర్వత పేర్కొన్నట్లు తెలిసింది. కొత్త ఇన్‌ఛార్జి అయిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ఎమ్మెల్యే పర్వత తీరుతో తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. కొత్త సంవత్సరం రోజున తన వద్దకు వైసీపీ క్యాడర్ రాకుండా పర్వత అడ్డుకున్నారని బహిరంగంగా గురువారం నిప్పులు కక్కారు. తనకు ఇప్పుడు టిక్కెట్ వచ్చినా ఎన్నికలప్పుడు బీఫారం రాదని పర్వత చెబుతుండడంపై మండిపడ్డారు. తాను గెలిచి జగన్‌కు తన బలం చూపిస్తానని అనుచరులవద్ద పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే పర్వత తనతో కలిసి పనిచేస్తారని అనుకోవడం లేదని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో వైసీపీలో ఈ ఇద్దరి నేతల వ్యవహారం మున్ముందుకు ఎంతవరకు వెళ్తుందోనని వైసీపీ శ్రేణులు తలపట్టుకుంటున్నాయి. కాగా ఎమ్మెల్యే పర్వత ఉండగానే, రెండేళ్ల కిందట వరుపులను వైసీపీ అధిష్ఠానం పిలిపించుకుని నియోజకవర్గంలో చురుగ్గా ఉండాలని చెప్పింది. అప్పటినుంచి వరుపుల పార్టీలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. కానీ ఎమ్మెల్యే పర్వత తన అధికారంతో వరుపులను ముప్పుతిప్పలు పెట్టారు. ఇప్పుడు టిక్కెట్ కోల్పోయారు. టిక్కెట్ వరుపులకు ఇవ్వడంతో ఏంచేద్దామని, ఆయనతో కలిసి పనిచేయాలని కొందరు అనుచరులు ఎమ్మెల్యే పర్వతవద్ద ప్రస్తావించగా ఆయన గుడ్లురమడంతో వైసీపీ నేతలు, క్యాడర్ దిక్కుతోచక తలపట్టు కుంటున్నారు. బుధవారం కాకినాడ పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌వద్ద వీరిద్దరూ తలోదారి అన్నట్లు వ్యవహరించారు.

సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల..
ఆర్డీవో కార్యాలయం ముట్టడి



ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించిన సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు

- 16వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

కాకినాడ సిటీ, జనవరి 4: సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కాకినాడ ఆర్డీవో కార్యాలయాన్ని 16వరోజు గురువారం ముట్టడించారు. ఈ సందర్భంగా విధులకు ఆటంకం కలిగించవద్దని ముట్టడి చేసిన ఉద్యోగులతో పోలీసులు వాగ్వివాదానికి దిగారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి కలగజేసుకుని రాజ్యాంగం ప్రకారం పోలీసులు విధులు నిర్వర్తిం చాలని కోరారు. ముట్టడికి ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు విచ్చేసి మాట్లాడారు. ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చంటిబాబు, సత్యనాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు ఎంవీ సాయికిరణ్, ఎ.లోవరాజు, పీవీవీ మహాలక్ష్మి, ఎం.రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, నారాయణ, సాల్మన్, కోశాధికారి రాజు నాయకత్వం వహించారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల సమ్మె



కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘం జేఏసీ పిలుపు మేరకు కాకినాడ కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్మికులు గురువారం సమ్మె ప్రారంభించారు. కాకినాడలోని శారదాదేవి గుడివద్దఉన్న నగరపాలక సంస్థ కార్యాలయంవద్ద ఈ సమ్మె నిర్వహించారు. అక్కడినుంచి ప్రదర్శనగా బయలుదేరారు. ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26వేలు మంజూరు చేయాలని, మున్సిపల్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నేత పిర్ల కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంవల్లే సమ్మెకు దిగామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల శ్రమను ఈ రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటోందన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడగుండ, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పెదిరెడ్ల సత్యనారాయణ, యూనియన్ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవన స్థితిగతుల పెంపునకు కృషి: కేంద్రమంత్రి పురుషోత్తం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పురుషోత్తం

కొత్తపల్లి, జనవరి 4: మత్స్యకారుల జీవన స్థితిగతులను మెరుగుపరిచి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వీలుగా వీరికి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి పురుషోత్తమ్ తెలిపారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కేంద్ర జాయింట్ సెక్రటరీ నీతూ ప్రసాద్‌తో కలిసి కేంద్రమంత్రుల బృందం గురువారం ఉప్పాడలో పర్యటించింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద పిఠాపురం మండలం ఇరవాడకు చెందిన బోయికృష్ణకు వాహన తాళాలు అందజేశారు. మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ పరిక్రమలో భాగంగా మత్స్యకారులతో మమేకమవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అమీనాబాద్‌లో నిర్మాణంలో ఉన్న నూతన ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. సర్పంచ్ ఉమ్మడి జాన్, ఎంపీపీ కారె సుధశ్రీనివాసరావు, జడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ రావు చిన్నారావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కేసులపై పర్యవేక్షణ చేయాలి: కలెక్టర్

కాకినాడ సిటీ, జనవరి 4: జిల్లాలో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సక్రమంగా నిర్వహించడంతోపాటు వైద్యశిబిరాల్లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన కేసులపై వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం అమరావతినుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్ నుంచి జేసీ ఇలాక్కియ, వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యశిబిరాలు, ప్రత్యేక కేసుల కింద నమోదైన వాటిని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు పంపి మెరుగైన వైద్యసేవలందేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ నూరుశాతం పూర్తిచేయాలన్నారు. జిల్లాలో చేపట్టిన భూ హక్కు, భూరక్ష మూడోదశ సర్వేపనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహనాయక్, డీఐవో కె.రత్నకుమార్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి.రాధాకృష్ణ, సీపీవో పి.త్రినాథ్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



యాగంలో పాల్గొన్న చైతన్యరాజు, బాపిరాజు దంపతులు

శ్రీవారి వైభవోత్సవం

గైట్‌లో ఘనంగా ప్రారంభమైన చతుర్వేద మహాయాగం



రాజానగరం, జనవరి 4: లోక కల్యాణం, విశ్వశాంతిని కాంక్షిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వ ర్యంలో గైట్ ప్రాంగణంలో గురువారం శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేద మహాయాగం వైభవో పేతంగా నిర్వహించారు. చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్య నారాయణరాజు (చైతన్యరాజు) దంపతులు, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవికిరణ్‌వర్మ దంపతులు, గైట్ మేనేజింగ్ డైరెక్టర్ శశికిరణ్ వర్మ దంపతులు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దం పతులు జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేత మహా యాగాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి సుప్రభాతం, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, నివేదనము, సర్వ దర్శనం, తిరుప్పావడ సేవతో పాటు శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా తిరుపతి వైఖానన ఆగమ పండితులు దీవి బాలాజీ రంగా చార్యులు పర్యవేక్షణలో అంగరంగ వైభ వంగా జరిపించారు. అలాగే సాయంత్రం నుంచి స్వామివారి సర్వ దర్శనం, శుద్ధి ఏకాంత సేవా కార్య క్రమాలు నిర్వహించారు. అన్నవరం, ద్వారకా తిరుమల నుంచి వచ్చిన రథాలతో కొలువైన సత్యదేవుడు, శ్రీవేంకటేశ్వరస్వామికి కూడా ఆయా ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ద్వాదశి జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, ప్రముఖులు డీబీవీ రాజు, కేశవరాజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నేటి నుంచే గైట్ ప్రాంగణంలో తెలుగు మహాసభలు



ప్రత్యేక అలంకరణలు

రాజానగరం, జనవరి 4: చైతన్య విద్యా సంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్తంగా గైట్ ప్రాంగణంలో తలపెట్టిన అంతర్జాతీయ తెలుగు మహా సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషిక్త సహస్రాబ్ది ఉత్సవాలు నీరాజనంగా నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతర్జాతీయ తెలుగు మహా సభలను రాజమహేంద్రవరం వేదికగా గైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. మూడు రోజులు పాటు తెలుగు మహాసభలు జరుగు తాయన్నారు. దీనిలో భాగంగా గైట్ ప్రాంగణంలో రాజరాజ నరేంద్రుని వేదికతో పాటు గైట్ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలో నారాయణభట్టు వేదిక, ఆదికవి నన్నయ్య వేదికలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

కొలువుదీరిన మహనీయుల విగ్రహాలు









రాజానగరం, జనవరి 4: అంతర్జాతీయ తెలుగు మహాసభలను పురస్కరించుకుని గైట్ ప్రాంగణంలోని ప్రధాన వేదికల వద్ద ఏర్పాటు చేసిన ప్రముఖుల విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. గైట్ ప్రాంగణంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న అంతర్జాతీయ తెలుగు మహా సభల ప్రధాన వేదిక వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రముఖుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. తెలుగు భాషకు శోభనద్దిన ప్రముఖుల విగ్రహాలు అంతర్జాతీయ తెలుగు మహాసభల ప్రధాన వేదిక వద్ద కొత్త అందాలను తెచ్చిపెడుతున్నాయి. విద్యార్థులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారంతా ఆయా విగ్రహాల వద్ద నిలబడి ఫొటో తీసుకుంటున్నారు. గోదావరి ప్రాంత అన్నదాతల ఆరాధ్య దైవంగా భావించే సర్ ఆర్థర్ కాటన్, ఎంఎస్ సుబ్బలక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు, కవయిత్రి మొల్ల విగ్రహాలు జీవకళతో ఉట్టిపడుతున్నాయి.

కోరికలు దుఃఖానికి మూలం

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



అనపర్తి, జనవరి 4: కోరికలు దుఃఖానికి మూలమని నియమ బద్ధంగా జీవితాన్ని గడిపేవారు, ధర్మాన్ని ఆచరించే వారు జన్మ రాహిత్యాన్ని పొందుతారని మహా సహస్రావధాని గరికపాటి నరసి ంహారావు అన్నారు. అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీ శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా మూడో రోజైన గురువారం త్యాగ మూర్తి కుంతి అంశంపై ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మహాభారత పాత్రల విశ్లేషణ త్యాగమూర్తి కుంతీదేవిపై తనదైన శైలిలో చమత్కారాలు, చలోక్తులతో ఆధ్యాత్మిక ప్రవచనం సాగింది. ఈ కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, ఆధ్యాత్మికవేత్త రెడ్డి సురేష్‌శర్మ, కొవ్వూరి రఘునాథరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సత్తి రామారెడ్డి, కర్రి వెంకట రామకృష్ణారెడ్డి, బచ్చు వీరవెంకటరమణ, లింగం ఫణికుమార్, మేడపాటి చెల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యనమదల మురళీకృష్ణకు మధునాపంతుల పురస్కారం



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4: ఆయుర్వేద ఆచార్య, భాషా ప్రవీణ మధునా పంతుల సూరయ్యశాస్త్రి శత జయంతి సంద ర్భంగా కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్ర మిక వైద్య నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలి పారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం లోని పల్లిపాలెం గ్రామానికి చెందిన మధునా పంతుల సూరయ్యశాస్త్రి ఆయుర్వేద వైద్యుడిగా కవిగా, పండితుడిగా ప్రఖ్యాతిగాంచారు. తన శిష్యులను చాలామందిని ఉన్నత, ఉత్తమపౌ రులుగా తీర్చిదిద్దారు. ఆయుర్వేద వైద్యుడిగా ప్రత్యేకించి దీర్ఘకాల క్లిష్ట మైన రోగాలకు చికిత్సను అందించి ఎందరినో స్వస్థపరిచారు. ఆయన శత జయంతి ఉత్సవం సందర్భంగా ఈనెల 14న పల్లిపాలెంలోని మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమంలో డాక్టర్ యనమదల మురళీకృష్ణను ప్రతిభా పురస్కా రంతో సత్కరించనున్నట్లు మధునాపంతుల సత్యనారాయణమూర్తి తెలిపారు. ఇటీవల కొవిడ్ సమయంలోను, గతంలో ఎయిడ్స్ బాధి తుల గురించి సాధికారమైన వైద్య విజ్ఞానాన్ని విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చి ప్రజల్లో భరోసా నింపినందుకుగాను ఆయనను ఈ ప్రతిభా పురస్కారంతో గౌరవిస్తున్నట్లు తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



సామర్లకోట, జనవరి 4: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచు కుని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్ పరిధిలో సామర్లకోట మీదుగా ఎనిమిది సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి కార్యాలయం నుంచి గురువారం రాత్రి సమాచారం అందింది. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

07027 నంబరు గల హైద్రాబాద్- బెరహమ్‌పూర్ మధ్య రాకపోకలు సాగించేందుకు సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 13 తేదీ శనివారం ఒక ట్రిప్ బయలుదేరనుంది. ఈ రైలు శనివారం హైద్రాబాద్‌లో రాత్రి 10.40 నిమిషాలకు బయలుదేరి శనివారం సాయంత్రం 3.15 గంటలకు బెరహమ్‌పూర్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, కొండపల్లి, రాయనపాడు, ఏలూరు, నిడదవోలు, రాజమండ్రి మీదుగా సామర్లకోటకు ఉదయం 8.13కి చేరుకుని అన్నవరం 8.45కి చేరుకుని అనకాపల్లి మీదుగా బెరహమ్‌పూర్‌కు ఆదివారం సాయంత్రం 3.15కి వెళతుంది.

07028 నంబరు గల బెరహమ్‌పూర్-హైద్రాబాద్ మధ్య సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం జనవరి 14 తేదీ సాయంత్రం 6.00కి బయలుదేరి దువ్వాడకు రాత్రి 11.30కి చేరుకుంటుంది. అన్నవరానికి అర్ధరాత్రి 12.43కి చేరుకుంటుందని, సామర్లకోటకు రాత్రి 1.23కి చేరుకుంటుందన్నారు. రాజమండ్రి, నిడదవోలు, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, జనగాం, సికింద్రాబాద్ మీదుగా హైద్రాబాద్‌కు సోమవారం ఉదయం 11.30 గంటలకు చేరుకుంటుంది.

07022 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-సికింద్రాబాద్ మధ్య జనవరి 12న శుక్రవారం సాయంత్రం 5.40కి బయలుదేరనుంది. ఈ రైలు సామర్లకోటకు రాత్రి 6.10కి చేరుకుంటుంది. అనపర్తికి 6.30కి చేరుకుని రాజమండ్రికి రాత్రి 6.50కి చేరుకుంటుంది. నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, రాయనపాడు, కొండపల్లి, ఖమ్మం, వరంగల్, ఖాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు శనివారం తెల్లవారుజామున 5.55కి చేరుకుంటుంది.

07221 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-కాకినాడ మధ్య జనవరి 11న గురువారం రాత్రి 9 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరనుంది. ఈ రైలు ఖాజీపేట, వరంగల్, ఖమ్మం, కొండపల్లి, రాయనపాడు, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు మీదుగా రాజమండ్రికి శుక్రవారం ఉదయం 6.10కి చేరుకుని, అనపర్తికి 6.30కి, సామర్లకోటకు 6.50కి, కాకినాడకు 8 గంటలకు చేరుకుంటుంది.

07025 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-బెరహమ్‌పూర్ మధ్య జనవరి 12,19 తేదీలలో ప్రతీ శుక్రవారాలలో బయలుదేరనున్నాయి. ఈ రైలు శుక్రవారం రాత్రి 7.45కి సికింద్రాబాద్‌లో బయలుదేరి పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమండ్రికి శనివారం తెల్లవారుజామున 3.08కి చేరుకుని, సామర్లకోటకు 3.45కి చేరుకుంటుంది. అన్నవరం, అనకాపల్లి, పెందుర్తి, విజయనగరం, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం మీదుగా బెరహమ్‌పూర్‌కు శనివారం ఉదయం 11.15కి చేరుకుంటుంది.

07026 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బెరహమ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య జనవరి 13,20 తేదీలలో ప్రతీ శనివారాలలో మధ్యాహ్నం 12.30కి బయలుదేరనున్నాయి. ఈ రైలు బెరహమ్‌పూర్‌లో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, విజయనగరం, పెందుర్తి, అనకాపల్లి మీదుగా అన్నవరానికి సాయంత్రం 6.23కి చేరుకుని సామర్లకోటకు రాత్రి 7.08కి చేరుకుంటుంది. రాజమండ్రికి రాత్రి 7.55కి చేరుకుని తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు ఆదివారం ఉదయం 6.30కి చేరుకుంటుంది. మరిన్ని వివరాలకు, రైలు రిజర్వేషన్ టిక్కెట్లకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి అందించిన సమాచారంలో తెలిపారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుడి ఆదాయం రూ.47 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, జనవరి 4: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖి నేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. 98 రోజులకు ప్రధాన హుండీ, గుర్రాలక్కమ్మ హుండీల ఆదాయం రూ.46,08,255, అన్నదానం హుండీ ఆదాయం రూ.91,805 వచ్చింది. హుండీల ద్వారా మొత్తం రూ.47,00,060 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్య క్రమంలో జిల్లా ఏసీ కేఎస్‌వీ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

8న అప్రంటీస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి ఈనెల 8న ప్రైమినిస్టర్ నేషనల్ అప్రంటీస్ మేళా-24 నిర్వహి స్తున్నట్లు జిల్లా కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంఈవీ వర్మ తెలిపారు. జిల్లాలోని ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రంటీస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లోని వివిధ ట్రేడ్‌ల్లో ట్రైనింగ్ పూర్తి చే సిన ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 8639230775 నెంబరును సంప్రదించాలన్నారు.

పాత సామాన్ల దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.2 లక్షల ఆస్తినష్టం

కాకినాడ క్రైం, జనవరి 4: ఓ పాత సామాన్ల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరి గింది. ఈ ప్రమాదం కాకినాడలో గురువారం జరిగింది. రేచర్ల పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సి)కి సమీ పంలో జాకీర్ హుస్సేన్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న పాత సామాన్ల (స్క్రాప్) దుకాణంలో గురువారం రాగిని వేరు చేసే క్రమంలో వైర్లు కాల్చుతూ అక్కడ పనిచేసే వ్యక్తులు మంటను ఆపకుండా మార్చిపోయి బయటకు వెళ్లారు. దీంతో గాలి అధిక మవ్వడంతో మంటలు ఎగిసిపడి అగ్నికీలలు దావానంలా వ్యాపించాయి. ఈ క్రమంలో దుకాణం అగ్నికి ఆహుతి అయ్యింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాలిపేట అగ్నిమాపకాధికారి బి.ఏసుబాబు తన సిబ్బంది, శకటంతో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయానికి సంఘటనా స్థలంలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్ట య్యింది. అగ్నిమాపక సిబ్బందికి, స్థానికులు సహకరించడంతో మంటలు మరింత వ్యాప్తి చెందకుండా నిలువరింపజేయగలి గారు.

కొండరెడ్ల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

కేంద్ర ప్రభుత్వ మోటా డిప్యూటీ కార్యదర్శి మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

రంపచోడవరం, జనవరి 4: ఏజెన్సీలో నిరుపేద కొండరెడ్లకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ మోటా డిప్యూటీ కార్యదర్శి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజన్ మణికుమార్‌తో కలిసి మండలంలోని కొయ్యలగూడెం గ్రామంలో పర్యటించారు. జన్మన్ పథకం ద్వారా కొండరెడ్లకు గృహాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ కొండరెడ్లకు సంబంధించి సర్వే జరుపు తున్నామన్నారు. అనంతరం ఐఈసీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో హరికృష్ణ, ఎంపీటీసీ నర్రి పాపారావు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు చేసిందేమీలేదు

ఎమ్మెల్సీ ఐవీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

కాకినాడ సిటీ, జనవరి 4: ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీలేదని, గొప్పలకు పోయి సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేస్తోందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెం కటేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకినాడలోని ధర్నాచౌక్ వేదికగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్ అధ్యక్షతన గురువారం ధర్నా శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐవీ మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. భవిష్యత్‌లో మరింత పెద్ద పోరాటానికి యూటీఎఫ్ నాయకత్వం వెనుకాడదని హెచ్చరిక చేశారు. యూటీఎఫ్‌తో, ఉద్యోగ, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనగలగలేదన్నారు. ఈ విషయాన్ని జగన్‌రెడ్డి తెలుసుకుని తక్షణమే డిమాండ్లు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే పోరుబాటను మరింత ఉధృతం చేస్తామన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయి సొమ్ములు విడుదల చేయకుండా తమ స్వార్థానికి, సంక్షేమ పథకాలను వాడుకుంటోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వం, విద్యాశాఖ నిరంకుశ వైఖరి విడనాడి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులు సమ్మెలో ఉంటే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం ఎంతమాత్రం తగదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజు, ఎంవీ సాయిరాం, పీవీ రమణ, నాగమణి, ఐ.ప్రసాద్‌రావు, సురేష్‌కుమార్, పీవీవీ సత్యనారాయణ, వీరబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో మరో వ్యక్తి మృతి



స్వామిసతీష్(ఫైల్)

ప్రత్తిపాడు, జనవరి4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామం వద్ద బుధవారం రాత్రి చెట్టుకు మోటార్ బైక్ ఢీ కొన్న దుర్ఘటనలో తీవ్రంగా గాయపడ్డ 2వ సర్వేయర్ మలిరెడ్డి స్వామి సతీష్(26) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలం వద్దే సర్వేయర్ మురళీ అక్కడిక క్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయ పడిన స్వామి సతీష్‌ను అర్ధరాత్రే కాకినాడ జీజీహెచ్ అత్యవసర విభాగానికి తరలించి వైద్యసేవలు అందించి నప్పటి బ్రెయిన్ డెడ్ కావడంతో గురువారం మధ్యాహ్నం స్వామి సతీష్ మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో ఇరువురు యువ సర్వే యర్లు మృత్యువాత పడటం జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని విస్మయ పరి చింది. జరిగిన ప్రమాదంపై పలువురు అధికారులు విచారం వ్యక్తం చేశారు. మురళిది ఏలేశ్వరం కాగా,స్వామి సతీష్‌ది పిఠాపురం మండలం మల్లం గ్రామం. ఈ ఇరువురు ఏలేశ్వరం మండలంలో గత రెండేళ్లుగా సర్వే యర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.

కాటన్ బ్యారేజ్ రోడ్డు పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

ధవళేశ్వరం, జనవరి 4: గతుకుల మయంగా మారి, ప్రమాదకరంగా పరిణమించిన కాటన్ బ్యారేజ్ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమ య్యాయి. రోడ్డు పనులను తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ మాధవీ లత గురువారం పరిశీలించారు. పను లను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశిం చారు. ఇరిగేషన్ అధికారులు పర్యవే క్షించి పనులకు సంబంధించి ఎప్పటిక ప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశిం చారు. హెడ్ వర్క్స్ ఈఈ ఆర్. కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా ప్రభుత్వ హామీలు



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ముమ్మిడివరం, జనవరి 4: అందని ద్రాక్షగా ప్రభుత్వ హామీలు ఉన్నాయని, దీక్షా శిబిరంలో తాడుకి ద్రాక్ష పండ్ల గుత్తులు కటి వినూత్నంగా నిరసన తెలిపారు నగర పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మి కులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో తాడుకి ద్రాక్ష పండ్ల గుత్తులను కట్టి, వాటి వంక చూస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని, జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్యవసర విభాగాలైన విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను వారు నిలుపుదల చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు వనచర్ల విజయ్‌కుమార్, న్యాయవాదులు దోనిపాటి ఆంజనేయులు వడ్డి నాగే శ్వరరావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సమ్మెలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణకుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, కాశి రాంబాబు, బి.లోవరాజు, ఎం.భార్గవ్, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, బి.శ్రీను, వై.రమణ, ఎస్.రామరాజు, లక్ష్మి, అర్జావతి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా పోలవరం గ్రామసభ

కూనవరం, జనవరి 4: కూనవరం మండల కేంద్రంలో నిర్వ హించిన పోలవరం గ్రామ సభ రసాభాసగా మారింది. అవార్డు ఎంక్వైరీ సభలో గురువారం క్లస్టరు 1 నుంచి 2 వరకు నిర్వాసి తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు ఇచ్చిన ప త్రాలలో నిర్వాసితులు సంతకం చేసి ఇవ్వాలని తెలిపారు. అయితే ఆ పత్రాలలో ఎంత పరిహారం ఇస్తారో లేకపోవడంతో నిర్వాసితులు సంతకాలు పెట్టడానికి ముందుగా నిరాకరించారు. పరిహారం ఎంత వస్తుందో తెలియకుండా సంతకాలు పెట్టలే మంటూ నిర్వాసితుల పక్షాన టీడీపీ, జనసేన, సీపీఎం నాయ కులు గట్టిగా పట్టుబట్టారు. దీంతో అధికార వైసీపీ నాయకు లకు-ప్రతిపక్ష నాయకులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చివరికి అధికారులు జోక్యం చేసుకుని ఎవరికైనా అభ్యంతరం ఉంటే సంతకాలు చేయవద్దని, అభ్యంతరం లేనివారు సంతకాలు చేయవచ్చంటూ నిర్వాసితులకు తెలిపారు. కొంతమంది సంతకాలు చేయకుండా సభ నుంచి వెళ్లిపోగా మరికొంతమంది సంతకాలు పెట్టి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ అరకు అధికార ప్రతినిధి యడవెల్లి భాస్కరరావు, సీపీఎం నాయకులు నాగరాజు, టీడీపీ మండలం అధ్యక్షుడు బరబాటి ప్రకాష్, జనసే న నాయకులు, కూనవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమం త్‌గాంధీ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బండారు సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

న్యూటన్ చిత్రపటానికి నివాళి

గండేపల్లి, జనవరి 4: సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదిత్య గ్రంథాలయం, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో న్యూటన్ 381వ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ న్యూటన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డీన్స్ డాక్టర్ పి.రవికుమార్, కె.మనోజ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ జి.రామకృష్ణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి'

పెద్దాపురం, జనవరి 4: ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో డీఎస్పీ కె.లతాకుమారీతో కలసి ఆయన నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల మార్గదర్శకాలపై సెక్టోరియల్, పోలీస్, ఏఈఆర్వోలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టిసారించాలన్నారు. పోలింగ్‌కు సంబంధించి పూర్తి అవగాహన ఉండాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. సిబ్బంది అంతా సమన్వయం చేసు కుంటూ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని, వాటికి సంబంధించిన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ వజ్రపు జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, సీఐ రవికుమార, ఎస్ఐ సురేష్, మున్సిపల్ మేనేజర్ జ్యోతీరాణీ పాల్గొన్నారు.

'సమస్యాత్మక గ్రామాలను గుర్తించాలి'

ప్రత్తిపాడు, జనవరి 4: ఎన్నికల్లో పోలింగ్ సజావుగా నిర్వహణకు నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలు ముందుగానే అధికారులు గుర్తించాలని నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండల రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు పోలింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఐ ఎం.శేఖర్‌బాబు, తహశీల్దార్ పీగోపాలకృష్ణ హాజరయ్యారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ సెక్టార్ అధికారులు తమ పరిధిలో సమస్యాత్మక గ్రామాలతో పాటు పోలింగ్ కేంద్రాలను ముందుగా గుర్తించి సమాచారం అందించాలన్నారు. నియోజకవర్గంలో 227పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సజావుగా నిర్వహించే ఏర్పాట్లపై సెక్టార్ వారిగా అధికారులు గ్రూపు సమీక్షలు నిర్వహించారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, సతీష్, అన్నవరం, రౌతులపూడి ఎస్ఐలు, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

'రాబోయే రోజుల్లో బీసీలకు స్వర్ణయుగం'

కాకినాడ సిటీ, జనవరి 4: రాబోయే రోజుల్లో బీసీలకు స్వర్ణయుగం రాబోతుందని జయహో బీసీ సదస్సు ఎలుగెత్తి చాటిందని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సదస్సులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బీసీ నాయకులకు దిశా, నిర్దేశం చేశారన్నారు. సామాన్యులను ధనవంతులను చేసే ఈ-4 ఫార్ములాను ఈసారి అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్నట్టు ప్రకటించారన్నారు. బీసీలకు అమలు చేసే పథకాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వివరించారన్నారు.

'జగన్ బహిరంగ సభ ఎన్నికల డ్రామా'

కాకినాడ సిటీ, జనవరి 4: కాకినాడలో జరిగిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బహిరంగ సభ పెద్ద ఎన్నికల డ్రామా అని, రాబోయేఎన్నికల్లో జగన్‌రెడ్డి, ద్వారంపూడిని బంగాళాఖాతంలో కలపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జిల్లా తెలుగు మహిళాధ్యక్షురాలు సుంకర పావని విమర్శించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో రూ.3వేల పెన్షన్ ఇస్తానని అబద్ధపు హామీతో అధికారంలోకి వచ్చిన వైసీపీకి ఐదేళ్లకు ప్రజలు గుర్తుకువచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ప్రజలను మోసం చేయడానికి మాత్రమే రూ.3వేల పెన్షన్ విడుదల చేశారని ఆమె ఆరోపించారు.

'సముద్రంలో అక్రమ రవాణాపై సమాచారమివ్వాలి'

సర్పవరం జంక్షన్, జనవరి 4: సముద్ర మార్గం గుండా జరిగే అక్రమాలపై పోలీసులకు సమాచారం అందించాలని, మద్యం తాగి వేటకెళ్లరాదని వాకలపూడి మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ టీ.రామ్మోన్‌రెడ్డి కోరారు. గురువారం కాకినాడ ఫిషింగ్ హార్బర్, హార్బర్‌పేటలో మత్స్యకారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సముద్రంలో వేటకెళ్లే బోటు వివరాలు, లైసెన్స్, మత్స్యకారుల వివరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సముద్రంలో ఏవిధమైన అక్రమ రవాణా, అనుమానాస్పద వ్యక్తులు, బోట్లు కనిపించినా తక్షణం పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు. తుపాను సమయంలో అధికారుల సూచనలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఉమామోహన్, కానిస్టేబుల్స్ పణికుమార్ ఉన్నారు.

ఘనంగా పాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

కరప, జనవరి 4: మండలంలోని పెనుగుదురులో పునర్నిర్మించిన గ్రామదేవత ఆలయంలో గురువారం పాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రెడ్డిపల్లి వెంకట మాధవి, రమేష్, ఎంపీటీసీ బండారు సుజాత వెంకటేశ్వరరావులు ఆలయ ఉత్సవ కమిటీ, దేవాదాయ శాఖ ఈవో పీఎస్ఆర్‌వీ సూర్యనారాయణ రాజు పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కర్నాకుల సీతారామాంజనేయులు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జనసేన పార్టీ ఏసీపీ సభ్యుడు పంతం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన న్యాయవాదుల దీక్షలు

పిఠాపురం, జనవరి 4: ఏపీ న్యూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని కోర్టుల వద్ద న్యాయవాదులు చేస్తున్న రిలేనిరాహారదీక్షలు రెండోరోజు గురువారం కొనసాగాయి. నవంబరు 28నుంచి దశలవారీగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంలో కనీస స్పందన లేకపోవడంపై పిఠాపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ చట్టంతో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, చట్టాన్ని రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

కొత్తపల్లి, జనవరి 4: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కొత్తపల్లి మండలం ఉప్పాడలో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ఉమ్మిడి జాన్ భూమి పూజ చేశారు. సిమ్మెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్న అరబిందో ఫౌండేషన్ డైరెక్టర్లు నిత్యానందరెడ్డి, శరత్‌చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎస్ఆర్‌లో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో తీరప్రాంతం అభివృద్ధికి రూ.2కోట్లతో సిమ్మెంట్ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు నిర్మించిన ఫౌండేషన్‌కు అభినందనలు తెలియజేశారు.

పలుచోట్ల పింఛన్ల పంపిణీ

తుని రూరల్, జనవరి 4: వి.కొత్తూరులో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి రాజా వృద్ధులకు, వికలాంగులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జడ్పీటీసీ కోతల సూర్యామణి, సర్పంచ్ రోజా, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబు, ఆత్మకమిటీ చైర్మన్ చోడరాజు రాంబాబు రాజు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు ఉన్నారు.

తొండంగి: పిఇచిన్నయ్యపాలెం గ్రామంలో లబ్ధిదారులకు మంత్రి రాజా పింఛన్లు పంపిణీ చేసారు. వైసీపీ నేతలు పద్మ విజయ, ధూళిపూడి ఆంజనేయులు, నాగం గంగబాబు, గాబు రాజు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాకినీడి బాబు తదితరులు ఉన్నారు.

పిఠాపురం: పట్టణంలోని వైసీపీ కార్యాలయం వద్ద పెంచిన పింఛన్ మొత్తాలను ఒక్కొక్కరికి రూ.3వేల వంతున లబ్ధిదారులకు గురువారం కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అందజేశారు.

ఇర్రిపాకలో కోటి మట్టి శివలింగాల తయారీ

జగ్గంపేట, జనవరి 4: జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో కోటి మట్టి శివలింగాల తయారీ జరుగుతుంది. గురువారం కాకినాడ నుంచి చెక్క కుక్కుటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 70 మంది భక్తులు విచ్చేసి తయారీలో పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని రుద్ర పారాయణ నిర్వహించి నమకం, చమకం, మంత్రపుష్పం ఆలపించారు. 70 మంది తీసుకొచ్చిన స్వీట్లను మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మిదేవి దంపతులు 3 వేలమందికి పంచారు.

జగ్గంపేటలో ఈఆర్వో సమీక్ష

జగ్గంపేట, జనవరి 4: ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో 4మండలాల్లోని ఎన్నికల సెక్టార్ అధికారులతో సమావేశం సమీక్ష నిర్వహించారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, జగ్గంపేట తహశీల్దార్ బి.శ్రీదేవి తదితరులున్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సలార్, డెవిల్ బబుల్‌గమ్, యానిమల్, హాయ్ నాన్న

తిరుమల	:	డెవిల్
లక్ష్మి	:	డెవిల్
సీ అండ్‌సీ1	:	కపాలదీవి
సీ అండ్‌సీ2	:	సలార్
శ్రీప్రియ	:	పిండం
పద్మప్రియ	:	యానిమల్
సత్యగౌరి	:	పిండం
సూర్య 1	:	డెవిల్
సూర్య 2	:	సలార్

సారాతో ముగ్గురి అరెస్ట్

ప్రత్తిపాడు, జనవరి 4: మండలంలోని ఒమ్మంగి గ్రామంలో సెబ్ అధికారులు దాడులు నిర్వహించి 5లీటర్ల సారాతో శ్రీరంగం వెంకట సత్యనారాయణను అరెస్ట్ చేశారు. రాయవరం గ్రామంలో సూరంపూడి సత్యనారాయణ, ముప్పిడి శంకరయ్యలను 15లీటర్ల సారాతో అరెస్ట్ చేశారు. ధర్మవరం గ్రామంలో 10మద్యం క్వాటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని ముద్దాడ నల్లబ్బాయిని అరెస్ట్ చేశారు. దాడుల్లో సీఐలు టి.అశోక్, కె.గిరిధర్, ఎస్ఐ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

కొనసాగిన కార్మికుల నిరసనలు

గొల్లప్రోలులో అర్ధనగ్న ప్రదర్శన


పెద్దాపురంలో పొర్లు దండాలతో నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు


గొల్లప్రోలులో మోకాళ్లపై అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పెద్దాపురం, జనవరి 4: సమాన పనికి సమాన వేతనమివ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతోపాటు పలు డిమాండ్లతో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 10వ రోజుకు చేరుకుంది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో కార్మికులు పొర్లు దండాలతో నిరసన తెలియజేశారు. సీపీఎం మండల కార్యదర్శి సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించేవరకూ సమ్మెను విరమించేదిలేదన్నారు. శివకోటి అప్పారావు, వర్రే గిరిబాబు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పిఠాపురం: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, కరోనాలో పనిచేసిన 6నెలలకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆందోళనలో ఏఐటీయూసీ నాయకులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులున్నారు.

గొల్లప్రోలు: డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం చూపుతున్న మొండివైఖరిని నిరసిస్తూ గొల్లప్రోలులో పారిశుధ్య కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన శిబిరం వద్ద అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్మికులందరిని రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకుడు సీహెచ్‌వీ రమణ, నీలాపు ఏసమ్మ, బి.సత్యవతి, రామారావు, రాజమోహన్, బి.కుమారి, సీఐటీయూ నాయకుడు కుంచే చిన్నా తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమ్మె తుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆందోళన కొనసాగుతుంది. సీఐటీయూ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు ఇచ్చారు.

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల దీక్షల్లో యూనియన్ అధ్యక్షులు బొచ్చా శ్రీను, మల్లిపూడి లక్ష్మి, కె.కిషోర్, చెన్నా వెంకటేశ్వర్లు, చిడతా వరలక్ష్మి, సింగంపల్లి అప్పారావు, బంగారు వెంకన్న పాల్గొన్నారు. టీడీపీ కౌన్సిలర్లు బలుసు వాసు, జయలక్ష్మి సంఘీభావం ప్రకటించారు.

మాట తప్పిన సీఎం జగన్

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి


జీ.మామిడాడలో ప్రచారం నిర్వహిస్తున్న నల్లమిల్లి

పెదపూడి, జనవరి 4: అమలుకాని హామీలతో మాట తప్పి, మడమ తిప్పి ప్రజలను నయవంచన చేసిన ఘనత జగన్‌ది అని, నయవంచన ప్రభుత్వానికి త్వరలో చెల్లుచీటి ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలో జీ.మామిడాడలో గురువారం జరిగిన మహాశక్తి, బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి చేయకపోవడమే కాకుండా సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. సంక్షేమం పేరుతో చేసిన రూ.12లక్షల కోట్లలో సుమారు రూ.8లక్షల కోట్లకు లెక్కలు లేని పరిస్థితి నెలకొందన్నారు. జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలు మోసపోయారన్నారు. తన హయాంలో జీ.మామిడాడలో రూ.5కోట్లతో రంగరాయ మెడికల్ కాలేజి అనుబంధ హెల్త్ రూరల్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తే నేడు దానిని దాదాపుగా నిర్వీర్యం చేసిన ఘనుడు స్థానిక ఎమ్మెల్యే అన్నారు. రూ.14కోట్లతో నరసాపురం కాత్రావులపల్లి రోడ్డును అభివృద్ధి చేయగా గ్రామంలో మిగిలిన రోడ్డు నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేయించి టెండర్లు పిలిపించామన్నారు. ప్రభుత్వం మారి అధికారం చేపట్టిన ఎమ్మెల్యే టీడీపీకి, నల్లమిల్లికి ఎక్కడ పేరు వస్తుందోనని పనులు రద్దు చేయించడమే కాకుండా నేటికీ ఆయన మిగిలిన పనిని పూర్తి చేయలేకపోయాడన్నారు. టీడీపీ నాయకులు జుత్తుక సూర్యకుమారి, బండి సత్యవతి, సిరసపల్లి లక్ష్మి, సుభాషిణి, పుట్టా గంగా ధరచౌదరి, జుత్తుక కృష్ణ, కొటికలపూడి సత్తిబాబు, సానా శ్రీను, తమలంపూడి శివరామారెడ్డి, గణేష్, పలివెల బుజ్జి, గంటా రాజు, మెర్ల ప్రభాకర్ చౌదరి, జుత్తుక సూరిబాబు, ద్వారంపూడి గోపీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ గల్లంతు ఖాయం

తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య


కొమ్మనాపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దివ్య

తొండంగి, జనవరి 4: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన సృష్టించే సునామీలో వైసీపీ గల్లంతవ్వడం ఖాయమని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. గురువారం కొమ్మనాపల్లి గ్రామంలో నిర్వహించిన మీ ఇంటికి - మీ దివ్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకుని అనేకమంది వైసీపీ నేతలు పార్టీని వీడుతున్నారన్నారు. ఎక్కడ చూసినా టీడీపీ ప్రభంజనం కనబడుతోందని, రానున్న ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తుందన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలంతా ఐక్యంగా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యనమల శివరామకృష్ణ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పేకేటి హరికృష్ణ, పార్టీ మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, ప్రధాన కార్యదర్శి మురాలశెట్టి సత్యన్నారాయణ, కోన రాంబాబు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

జగ్గంపేట, జనవరి 4: జగ్గంపేట మండలం మర్రిపాక వైసీపీ ఎంపీటీసీ పైలా శివరామకృష్ణ, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో దుంగ మునలయ్య, చుక్క సతీష్, పైలా సుబ్రహ్మణ్యం, వాసిరెడ్డి అప్పారావు తదితర 40 కుటుంబాలకు చెందిన వారు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి నవీన్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలందరూ ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ నేత అనబాల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు బద్ది సురేష్, గద్దె మారుతి, కాపువరపు నూకాపతి, కాపవరపు ప్రకాశం, బండారు చిన్నయ్య, కాపవరపు వెంకటరమణ, రెడ్డి ఆంజనేయులు, కాపవరపు సత్యనారాయణ, కలికట్ల బాబురావు, తండ శ్రీను, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న జ్యోతుల నవీన్

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె


తాళ్లరేవులో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దాపురం, జనవరి 4: తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో జగన్ భవిష్యత్తును నిర్ణయించేది తామేనని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు దాడి బేబీ అన్నారు. మున్సిపల్ జంక్షన్ వద్ద గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిర్వహించిన సమ్మెను ఉద్దేశించి బేబీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా, సాధికార బస్సుయాత్ర చేపడుతున్న ప్రభుత్వానికి తమ సమస్యలు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. నాగమణి, అమల, ఎస్తేరురాణీ, అంగనవాడీ యూనియన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పిఠాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వేతనాలు అధికంగా ఇస్తామని తమ నెత్తిపై చేయి వేసి జగన్ హామీ ఇచ్చారని, దానినే నెరవేర్చమని అడుగుతున్నామన్నారు. ఆందోళనలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి, సీఐటీయూ నేతలు కుంచే చిన్నా, జి.వీరబాబు, విజయశాంత, ప్రజావాణి, నళిని, సత్యవతి, భవానీ, అమల, బేబీరాణి పాల్గొన్నారు.

తాళ్లరేవు: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరి బెదిరింపులకు జడిసేదేలేదని అంగన్‌వాడీల సంఘం అధ్యక్షురాలు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. 24 రోజులుగా సమ్మెచేస్తున్నా ప్రభుత్వం జాలిచూపించకపోయి బెదిరింపులకు దిగడం మంచిదికాదన్నారు. మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ వుంగరాల వెంకటేశ్వరరావు సమ్మెకు మద్దతు తెలియజేశారు. అంగన్‌వాడీలు పార్వతి, చంటమ్మ, జలావతి తదితరులున్నారు.

కరప: మండల పరిధిలోని అంగన్‌వాడీలు, ఆయాలు కరప తహశీల్దార్ కార్యాలయం వద్ద కాకినాడ రూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.వీరవేణి, కరప ప్రాజెక్టు నాయకురాలు ఎస్.వరలక్ష్మి, ఎం.భవాని, బి.ఆశారత్నం, ఆర్.దైవకుమారి ప్రజా సంఘాల ప్రతినిధులు నిరసన దీక్షలు చేపట్టారు.

సామర్లకోట: సామర్లకోట మండలం, పట్టణంలో అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 24వ రోజుకు చేరుకుంది.

కిర్లంపూడి: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీల మండలాధ్యక్షురాలు రత్నం అన్నారు.

ప్రత్తిపాడు: తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళనకు యునైటెడ్ మానవ హక్కుల పరిరక్షణ కౌన్సిల్ జాతీయ లీగల్ సెల్ కార్యదర్శి న్యాయవాది పిల్లి బలరాముడు మద్దతు తెలిపారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ, అఖిత భారత ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు మానుకొండ లచ్చబాబు సంఘీభావం తెలిపారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


పిఠాపురంలో కరపత్రాలు అందజేస్తున్న వర్మ

పిఠాపురం, జనవరి 4: తెలుగుదేశం పాలనలో వేసిన రోడ్లు, డ్రెయిన్లు తప్పితే వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో జగ్గయ్యచెరువు కాలనీలో రూ.12కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించినట్టు తెలిపారు. మరో రూ.2.70 కోట్లుతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేసిన ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయాయని చెప్పారు. ప్రస్తుత వైసీపీ పాలనలో ఆ నిధులతోనే పనులు చేస్తున్నారని తెలిపారు. ఎంపీ వంగా గీతా పిఠాపురం ఎమ్మెల్యేగా 2009 నుంచి 2014 వరకూ పనిచేశారని, ఆ సమయంలో జగ్గయ్యచెరువు అభివృద్ధికి ఒక్క పైసా వెచ్చించలేదన్నారు. జగ్గయ్యచెరువు కాలనీ అభివృద్ధిపై ఎంపీ, ఎమ్మెల్యే చర్చకు రావాలని ఆయన సవాల్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, వార్డు ఇన్‌చార్జిలు వాసంశెట్టి సూరిబాబు, జగదీష్, వనమాడి చంద్రశేఖర్, గాది కోటి, గరగపాటి రమణ, కర్రెడ్ల సత్యనారాయణ, కుంపట్ల ఏసుబాబు, సురేష్, మౌళి, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను పాల్గొన్నారు.

బీసీ సదస్సుకు తరలిన నేతలు


బీసీ సదస్సుకు హాజరైన ప్రత్తిపాడు నాయకులు

ప్రత్తిపాడు, జనవరి 4: మంగళగిరిలో మాజీ సీఎం చంద్రబాబు గురువారం ఏర్పాటు చేసిన జయహో బీసీ రాష్ట్ర సదస్సుకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, బీసీ నాయకులు మూది నారాయణస్వామి, పైలా సాంబశివరావు, తమరాన సత్యనారాయణ, ఇంధన ఏసుబాబు, మదినే దొరబాబు, ధనేకుల భద్రరావు, కోరాడ కృష్ణమోహన్, బెల్లాని శ్రీను, సామంతుల శ్రీరామ చంద్రమూర్తి, సిరిపురం దేవుడు హాజరయ్యారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా దృష్టి పెట్టాలి

కాకినాడ కమిషనర్ నాగనరసింహారావు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 4: పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకాధికారులు దృష్టి పెట్టాలని కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్, ప్రత్యేకాధికారులు శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమ్మెను దృష్టిలో పెట్టుకుని నగర ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చెత్తను రోడ్లపైన, డ్రైనేజీల్లో వేయవద్దని సూచించారు. సమావేశంలో ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాసరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, జేసీపీ నాగశాస్త్రులు, శానిటరీ సూపర్‌వైజర్లు ఎస్‌కే జిలానీ పాల్గొన్నారు.

98,795 దరఖాస్తుల పరిష్కారం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2024లో భాగంగా ఫారం 6, 7, 8 ద్వారా ఇప్పటివరకు సిటీ నియోజకవర్గ పరిధిలో 1,11,767 దరఖాస్తులు రాగా వాటిలో 98,795 దరఖాస్తులు పరిష్కరించినట్టు కమిషనర్ తెలిపారు. సవరణ ప్రక్రియ ప్రగతిపై నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తుది జాబితాను ఈనెల 22న ప్రచురిస్తామన్నారు.

పేదలకు కళ్లజోళ్లు, దుస్తుల పంపిణీ

కాకినాడ రూరల్, జనవరి 4: కాకినాడ లయన్స్ క్లబ్ హాల్లో బాదం బాలకృష్ణ క్లాత్ ఐగ్లాస్ ప్రాజెక్టు ద్వారా 75 మంది పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు, దుస్తులను కొమ్మిశెట్టి కుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ జీఎల్ జగన్నాధరావు, డాక్టర్ బాదం బాలకృష్ణ, రామసుబ్రహ్మణ్యం, మురళీ, కుమార్ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

కిర్లంపూడి, జనవరి 4: అయోధ్య రాముని అక్షింతలను కిర్లంపూడిలో గురువారం రామ భక్తులు ఇంటింటా పంపిణీ చేశారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి బయల్దేరి రాములోరి ఆలయం వద్ద వారం రోజులుగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో శ్రీరాముని అక్షింతలు ప్రతి ఇంటా పంపిణీ చేశారు.

కరప: గ్రామంలో శ్రీరామ భక్తులు జై శ్రీరామ్ అంటూ ఇంటింటికి అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలు అందజేశారు. గొర్నెల శ్రీనివాస్, సలాది మనోజ్‌కుమార్, పేపకాల వీర్రాజు , నక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరం ధ్యాన మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్నదొర ధ్యాన మండలి మహిళలతో కలిసి గ్రామంలో అయోధ్యరాముని అక్షింతలను పంపిణీ చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సత్యనారాయణ, రామకుర్తి రాజబాబు, నక్కా శ్రీను, పెదిరెడ్ల గంగారావు తదితరులున్నారు.

జగ్గంపేట: వెంగయమ్మపురంలో అయోధ్య రాములోరి అక్షింతలను కుంకుమ బొట్టు పెట్టి వితరణ చేశారు.

ఘనంగా అన్న కూటోత్సవం

సర్పవరం జంక్షన్, జనవరి 4: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని గురువారం ఘనంగా అన్న కూటోత్సవం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి విగ్రహదాత ఆకుల రాజబాబు, వెంకట లక్ష్మణరేఖ దంపతుల ఆధ్వర్యంలో 65 కిలోల పులిహోరతో ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ తయారుచేసిన వేంకటేశ్వరస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంటి నందిబాబు, వైఎస్‌కే మూర్తి, వెంకటేశ్వరరావు, మాణిక్యాలరావు, రెడ్డి, వేణు పాల్గొన్నారు.

'ఆధార్ ఆధారిత చెల్లింపులు వద్దు'

తాళ్లరేవు, జనవరి 4: ఉపాధిహామీ పథకంలో కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఎంపీడీవోకు గురువారం వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు కమిడి సత్యశ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు, త్రిమూర్తులు, తనుకురాజు, అదృష్టదీపుడు పాల్గొన్నారు.

నంది అవార్డు గ్రహీతకు సత్కారం

సర్పవరం జంక్షన్, జనవరి 4: ఏపీ రాష్ట్ర చలన చిత్ర టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన నంది నాటకోత్సవం-2022లో కాకినాడ ఏపీఎస్పీకి చెందిన సీతారామాంజనేయ నాట్యమండలి సభ్యుడు ఏడిద శాంతకుమార్ నంది అవార్డు సాధించారు. గురువారం ఏపీఎస్పీ రామాలయంలో సీతారామంజనేయ నాట్యమండలి అధ్యక్షుడు అన్నెపు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో శాంతకుమార్‌ని సత్కరించారు. కుమారి సుజాత, పి.రామకృష్ణ, మహాలక్ష్మి, పీవీ రమణ, పి.బాబూరావు, తురగా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు అభినందన

తుని రూరల్, జనవరి 4: ప్రభుత్వ డిగ్రీ కళాశాల తునికి చెందిన రసాయనక శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు ఢిల్లీలో ప్రదానం చేసే నేషనల్ గ్లోబల్ టీచర్ అవార్డు -2023కు ఎంపికై అవార్డును పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.లలిత, ఐపీసీఎస్ కోఆర్డినేటర్ ఎస్.శ్రీధర్, రసాయన శాస్త్రం హెడ్ మల్లేశ్వరరావు అభినందించారు.

జ్యోతుల నెహ్రూ పరామర్శ

కిర్లంపూడి, జనవరి 4: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ మండలంలో వేలంకకి చెందిన గండే కాసులు, గోవిందరాజులను, చిల్లంగికి చెందిన మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు సూర్యకుమారి అత్తయ్య ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ మండలాధ్యక్షుడు చందరం చంటిబాబు, టీడీపీ సమన్వయ కమిటీ సభ్యులు జంపన సీతారామచంద్రవర్మ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

కిర్లంపూడి, జనవరి 4: మండలంలో వేలంక గ్రామానికి చెందిన వైసీపీ నేత శెట్టి సోమరాజు మండల గ్రామాల్లోని రోడ్లపై పేద మహిళలు 30 మందికి చీరలు పంపిణీ చేశారు.

శబరిమలకు 100 మంది పయనం

తుని రూరల్, జనవరి 4: ఎస్.అన్నవరం నుంచి శబరిమలకు గురువారం గ్రామస్తులు 100 మంది మండల దీక్ష ముగించుకుని పయనమయ్యారు. గురుస్వామి చోడిశెట్టి కన్న ప్రకాష్ చోడిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.